క్లుప్తంగా

సమస్యల సత్వర పరిష్కారానికి కృషి

రాష్ట్ర ఎస్సీ కమిషన్ చైర్మన్ జవహర్



వేగేశ్వరపురంలో మేరీమాత ఆలయం వద్ద మాట్లాడుతున్న జవహర్

తాళ్లపూడి: ఎస్సీ కమిషన్ దృష్టికి వచ్చిన సమస్యలను సత్వరం పరిష్కరించడానికి చర్యలు తీసుకుంటున్నామని రాష్ట్ర ఎస్సీ కమిషన్ చైర్మన్ కేఎస్ జవహర్ అన్నారు. వేగేశ్వరపురంలోని గోదావరి మేరీమాత ఆలయంలో శనివారం మేరీమాతను దర్శించుకున్నారు. ఈ సందర్భంగా ఫాదర్ టి.జాన్ ప్రత్యేక ప్రార్థనలు చేశారు. అనంతరం జవహర్‌కు శాలువాతో సత్కరించి, కేక్ కట్ చేశారు. ఈ సందర్భంగా జవహర్ మాట్లాడుతూ, గతంలో రాష్ట్రంలోని దళితులపై జరిగిన దాడులపై పలువురిని కలుస్తామని తెలిపారు. ప్రతి మంగళ, బుధవారాల్లో రాష్ట్ర కమిషన్ కార్యాలయంలో గ్రీవెన్స్ జరుగుతుందన్నారు. నేరుగా లేదా పోస్టులో కూడా వినతులు అందజేయవచ్చన్నారు. ఆయన వెంట పలువురు ప్రముఖులు ఉన్నారు.

పుంత రోడ్డును అభివృద్ధి చేయాలి

చాగల్లు: చంద్రవరం గ్రామ శివారులో పొలాల్లో ఉన్న పుంత రోడ్డును అభివృద్ధి చేయాలని రైతులు కోరుతున్నారు. చంద్రవరం నుంచి మార్కొండపాడు గ్రామం వరకు కిలోమీటరు ఉన్న ఈ పుంత రోడ్డు పూర్తిగా ఛిద్రమైంది. ఈ రోడ్డులో చంద్రవరం, మార్కొండపాడు గ్రామాల రైతులకు చెందిన వందలాది ఎకరాల పొలాలు ఉన్నాయి. వ్యవసాయ ఉత్పత్తులను చెరవేయడం ఇబ్బందికరంగా ఉంటోందని రైతులు చెబుతున్నారు. వర్షాకాలంలో బురదలోనే పొలాలకు వెళ్లాల్సి వస్తోందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. అధికారులు స్పందించి, రోడ్డును అభివృద్ధి చేయాలని కోరుతున్నారు.

మలుపు.. మృత్యు పిలుపు

- రోడ్ల మలుపుల్లోనే అధిక ప్రమాదాలు
- పరిష్కారం అన్వేషించని అధికార యంత్రాంగం
- హెచ్చరిక బోర్డులూ ఏర్పాటు చేయని వైనం
- అవే స్పాట్లలో పదేళ్లలో 36 ప్రమాదాలు
- 18 మరణాలు, 22 మంది క్షతగాత్రులు



పెరవలి ఇరిగేషన్ కార్యాలయం సమీపంలో ప్రమాదకర మలుపు



పెరవలి జాతీయ రహదారిని కలిపే అపాయకర మలుపు

పెరవలి: ఆ రహదారుల మలుపుల్లో మృత్యువు తాండవిస్తోంది. రహదారులు అసలే అంతంతమాత్రం. వీటి మలుపుల్లో ఏ మాత్రం ఆదమరచినా.. ప్రమాదానికి గురికాక తప్పదు. నిత్యం ప్రాణాపాయం పొంచిఉన్న ఈ రహదార్ల మలుపుల్లో ప్రయాణమంటేనే జనం భీతిల్లుతున్నారు. మండలంలో 13 కి.మీ. మేర జాతీయ రహదారి, 35 కి.మీ. మేర ఆర్అండ్‌బీ రహదారులు ఉన్నాయి. నిడదవోలు–నర్సాపురం రహదారికి ఒకవైపు నర్సాపురం కాలువ, మరోవైపు పంట భూములు ఉన్నాయి. దీనివల్ల ఈ మలుపుల వద్ద అనేక ప్రమాదాలు జరుగుతున్నాయి. ముఖ్యంగా పెరవలి నుంచి కాకరపర్రు వరకు ఉన్న రెండు కి.మీ. రహదారిలో ఆరు మలుపులు ఉండగా, వీటిలో రెండు అత్యంత ప్రమాదకరంగా ఉన్నాయి. పదేళ్లుగా కేవలం మలుపుల వద్ద 36 ప్రమాదాలు జరగ్గా, 18 మరణాలు సంభవించాయి. 22 మంది క్షతగాత్రులు అయ్యారు. మూడేళ్ల క్రితం జూలైలో ఈ మలుపు వద్ద లారీ ఢీకొనడంతో ఆటో కాలువలోకి దూసుకెళ్లింది. ఈ ఘటనలో నలుగురు గాయపడ్డారు. ఆ మరుసటి రోజే రెండు మోటార్ సైకిళ్లు ఢీకొనడంతో ఇద్దరికి గాయాలయ్యాయి. రెండేళ్ల క్రితం ఫిబ్రవరిలో ఇదే ప్రాంతంలో లారీ ఢీకొన్న దుర్ఘటనలో ముగ్గురు చనిపోయారు. మే నెలలో సైక్లిస్టును లారీ ఢీకొనగా ఒకరు మరణించారు. గతేడాది ఇదే ప్రాంతంలో ఆటో కాలువలోకి దూసుకెళ్లడంతో ఇద్దరు మృతిచెందారు.



కాకరపర్రు వంతెన వద్ద.. ఏడు ప్రమాదాలు

మరో మలుపు ఇరిగేషన్ కార్యాలయం వద్ద ఉంది. ఇక్కడ గతేడాది ఏడు ప్రమాదాలు జరిగాయి. ఇందులో ఎనిమిది మంది గాయపడగా, ఇద్దరు చనిపోయారు. కాకరపర్రు వద్ద ఉన్న మలుపు తీవ్ర ప్రమాదకరమైంది. ఇక్కడ తరచూ ప్రమాదలు సంభవిస్తూనే ఉంటాయి. ఇక్కడ రోడ్డుతో పాటు, వంతెన కూడా ఒంపుగా ఉండటంతో.. వేగంగా వచ్చిన వాహనాలు అదుపుతప్పి కాలువలోకి నేరుగా దూసుకుపోతున్నాయి. మూడేళ్ల క్రితం ఏప్రిల్ 28న ఇక్కడ లారీ వేగంగా వచ్చి కాలువలో దూసుకుపోయింది. ప్రమాద సమయంలో కాలువలో నీరు లేకపోవటం వల్ల డ్రైవర్, క్లీనర్ గాయాలతో ప్రాణాపాయం నుంచి బయటపడ్డారు. ఎనిదేళ్ల క్రితం అరటి గెలల లోడుతో వస్తున్న లారీ ఈ మలుపులో అదుపుతప్పి బోల్తా పడటంతో ముగ్గురు మృతి చెందగా, 12 మంది క్షతగాత్రులయ్యారు. వీరిలో ముగ్గురు శాశ్వత వికలాంగులుగా మారిపోయారు.

రక్షణ చర్యలు నిల్

ఇలా మలుపుల వద్ద తరచూ ప్రమాదాలు జరుగుతున్నా ఇరిగేషన్, పోలీసు శాఖ, ఆర్అండ్‌బీ అధికారులు ఎటువంటి రక్షణ చర్యలు తీసుకోకపోవడంపై పలువురు తీవ్రంగా విమర్శిస్తున్నారు. గతంలో ఈ మలుపుల వల్ల జరిగిన ప్రమాదాలపై సాక్షిలో వచ్చిన కథనాలకు ఆర్అండ్‌బీ అధికారులు స్పందించి, కాకరపర్రు మలుపు వద్ద సిమెంట్ పోల్స్‌ను కాలువవైపు ఏర్పాటు చేశారు. ఈ మలుపుల వద్ద హెచ్చరిక బోర్డులను ఏర్పాటు చేస్తేనే కొన్ని ప్రమాదాలనైనా నివారించవచ్చని పలువురు చెబుతున్నారు.

హెచ్చరిక బోర్డులు లేక..



పెరవలి మండలంలో ఉన్న ఆర్అండ్‌బీ, జాతీయ రహదారుల్లో ఉన్న మలుపుల వద్ద ఎక్కువగా ప్రమాదాలు జరుగుతున్నాయి. అందుకు వేగంగా రావటం, వాహనాలు అదుపుతప్పడం కూడా కారణం. కనీసం ఈ మలుపుల వద్ద ఎటువంటి హెచ్చరిక బోర్డులు లేకపోవటంతో.. రోడ్డు ఉందన్న భ్రమలో వాహనాలు వచ్చి ప్రమాదాలకు గురవుతున్నాయి.

– కాపకా సూర్యనారాయణ, కాకరపర్రు

ఎన్నిసార్లు విన్నవించినా..



రోడ్లలో ఉన్న మలుపులు అత్యంత ప్రమాదకరంగా మారాయి. అధికారులకు ఎన్నిసార్లు విన్నవించినా కనీసం హెచ్చరిక బోర్డులు ఏర్పాటు చేయలేదు. ఏ మాత్రం అజాగ్రత్తగా ఉన్నా వాహనాలు కాలువలోకి లేక, పొలాల్లోకి దూసుకుపోతున్నాయి. ఎవరూ పట్టించుకోవటం లేదు. ప్రమాదాలు ఆగటం లేదు.

– చిన్నం సత్తిపండు, గ్రామస్తుడు, ఖండవల్లి

సర్వీస్ రోడ్డు నిర్మించాలని ధర్నా

నిడదవోలు: పట్టణంలో ఏడాదిన్నరగా ఆర్వోబీ నిర్మాణ పనులతో ప్రజలు, వ్యాపారులు ట్రాఫిక్ ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని, తక్షణమే సర్వీస్ రోడ్లు నిర్మించాలని డిమాండ్ చేస్తూ ఆర్వోబీ నిర్మాణ పనుల వద్ద సీపీఎం, జనసేన పార్టీల నాయకులు శనివారం ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయా పార్టీల నాయకులు జువ్వల రాంబాబు, రంగా రమేష్ మాట్లాడుతూ, ఆర్వోబీ కాంట్రాక్టర్లు, అధికారులు ప్రజల సౌకర్యాలను పట్టించుకోవడం లేదని మండిపడ్డారు. వర్షాలతో జనజీవనం అస్తవ్యస్తమవుతుందని, ట్రాఫిక్ జామ్‌తో పాటు, ప్రజలు అనేక అవస్థలు పడుతున్నారని వాపోయారు. సహనం కోల్పోవడంతో రోడ్డెక్కి ఆందోళన చేయాల్సిన దుస్థితి ఏర్పడిందన్నారు. ప్రజల సౌకర్యార్థం తక్షణం సర్వీస్ రోడ్డు నిర్మించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో రోటరీ క్లబ్ అధ్యక్షుడు కుమార్, గ్రంధి బాలాజీ, చిలకల మల్లికార్జునరావు తదితరులు పాల్గొన్నారు.

పెండ్యాలకు మాజీ మంత్రి వనిత పరామర్శ



హరేరామకృష్ణను పరామర్శిస్తున్న తానేటి వనిత తదితరులు

దేవరపల్లి: వైఎస్సార్ సీపీ నల్లజర్ల మండల నాయకుడు, పోతవరం సొసైటీ మాజీ అధ్యక్షులు పెండ్యాల హరేరామకృష్ణను శనివారం మాజీ హోం మంత్రి, పార్టీ రాష్ట్ర క్రమశిక్షణా కమిటీ సభ్యురాలు తానేటి వనిత పరామర్శించారు. ఇటీవల హరేరామకృష్ణ అనారోగ్యానికి గురై, ఇంటి వద్ద విశ్రాంతి తీసుకుంటున్నారు. పార్టీ మండల అధ్యక్షుడు వెల్లంకి సుబ్రహ్మణ్యం, రాష్ట్ర కార్యదర్శి ముప్పిడి వెంకటరత్నం, పెండ్యాల వీరరాఘవులు, గ్రామ కమిటీ అధ్యక్షుడు కానూరి ప్రసాద్, ఎంపీటీసీ సభ్యులు చిడిపి చింతయ్య, పాపా నాగు తదితరులు ఆయనను పరామర్శించారు.

జీవితంలో యోగా భాగం కావాలి

- జిల్లా కలెక్టర్ ప్రశాంతి
- కొవ్వూరు గోష్పాద క్షేత్రంలో యోగాంధ్ర



కొవ్వూరు గోష్పాద క్షేత్రంలో యోగా సాధన చేస్తున్న ప్రముఖులు, ఉద్యోగులు

తాళ్లపూడి (కొవ్వూరు): యోగాను తమ జీవనంలో భాగం చేసుకోవాలని, మంచి ఆరోగ్యానికి, మానసిక ప్రశాంతతకు ప్రతి ఒక్కరూ యోగా సాధన చేయాలని జిల్లా కలెక్టర్ పి.ప్రశాంతి అన్నారు. కొవ్వూరు గోష్పాద క్షేత్రం వీఐపీ ఘాట్ వద్ద శనివారం యోగాంధ్ర ట్రయల్ రన్ నిర్వహించారు. కలెక్టర్‌తో పాటు, ఎమ్మెల్యే ముప్పిడి వెంకటేశ్వరరావు, జాయింట్ కలెక్టర్ ఎస్.చిన్నరాముడు, ఆర్డీవో రాణి సుస్మిత, ఇతర అధికారులు, పట్టణవాసులు ఉత్సాహంగా యోగా సాధన చేసారు. ఆర్ట్ ఆఫ్ లివింగ్ సంస్థ యోగా గురువు సరోజ యోగాసనాలు వేయించారు. అనంతరం రాజ యోగా ధ్యానం చేశారు. కలెక్టర్ ప్రశాంతి మాట్లాడుతూ, గోష్పాద క్షేత్రం ఆధ్యాత్మికంగా, పర్యాటకంగా ప్రాముఖ్యత కలిగిన ప్రాంతమని చెప్పారు. 21న జరిగే యోగాంధ్రలో అన్ని వేదికల్లో ప్రజలు పెద్దఎత్తున పాల్గొనాలని కోరారు. జిల్లాలో 7.64 లక్షల మంది నమోదు చేసుకున్నట్లు చెప్పారు. ఆదివారం గోదావరి నది మధ్య బ్రిడ్జి లంకలో జిల్లా స్థాయి యోగాంధ్ర నిర్వహిస్తున్నట్లు తెలిపారు. జేసీ, నోడల్ అధికారి చిన్నరాముడు మాట్లాడుతూ, వాడవాడలా యోగా సాధన చేయాలన్నారు. అంతర్జాతీయ యోగా దినోత్సవం రోజున ఇదే ఉత్సాహంతో పాల్గొనాలని కోరారు. కార్యక్రమంలో కొవ్వూరు మున్సిపల్ చైర్‌పర్సన్ బావన రత్నకుమారి, కమిషనర్ టి.నాగేంద్రకుమార్, డీఎల్డీఓ స్లీవా రెడ్డి, వివిధ శాఖల అధికారులు, ప్రజాప్రతినిధులు, వేద పండితులు, విద్యార్థులు, స్వచ్ఛంద సంస్థల ప్రతినిధులు పాల్గొన్నారు.



గోష్పాద క్షేత్రంలో ఏర్పాట్లు పరిశీలిస్తున్న కలెక్టర్, ఎమ్మెల్యే, జేసీ, ఆర్డీవో తదితరులు



రోటరీ ఆడిటోరియంలో యోగాసనాలు వేసిన ఉద్యోగులు

సంపూర్ణ ఆరోగ్యం

నిడదవోలు: ప్రతిరోజు యోగా చేసిన వారు సంపూర్ణ ఆరోగ్యం పొందవచ్చని మున్సిపల్ చైర్మన్ భూపతి ఆదినారాయణ అన్నారు. పట్టణంలోని రోటరీ ఆడిటోరియంలో మున్సిపల్ కమిషనర్ టి.కృష్ణవేణి ఆధ్వర్యంలో యోగాంధ్ర కార్యక్రమం నిర్వహించారు. యోగా గురువు సమీప సుబ్బారావు యోగాపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో తహసీల్దార్ నాగరాజు నాయక్, ఎక్సైజ్ సీఐ సతీష్‌బాబు, కౌన్సిలర్లు, సచివాలయ, మున్సిపల్, మెప్మా సిబ్బంది పాల్గొన్నారు.



తిమ్మరాజుపాలెం కోట సత్తెమ్మ ఆలయం వద్ద..

మానసిక ప్రశాంతత

పెరవలి: యోగాతో మానసిక ప్రశాంతత లభించి, ఆరోగ్య సమస్యలు పరిష్కారమవుతాయని ఎంపీడీఓ పద్మజ అన్నారు. పెరవలి మండలంలోని 18 గ్రామాల్లో యోగాంధ్ర ట్రయల్ రన్ చేపట్టామన్నారు. ఆయా గ్రామాల సర్పంచ్‌లు, ఎంపీటీసీ సభ్యులు, అధికారులు, నాయకులు పాల్గొన్నారు.

ఆరోగ్యానికి మేలు

నిడదవోలు రూరల్: యోగా ఆరోగ్యానికి ఎంతో మేలు చేస్తుందని యోగా గురువు సానెపు వెంకట సుబ్బారావు అన్నారు. యోగాంధ్రలో భాగంగా తిమ్మరాజుపాలెం కోట సత్తెమ్మ ఆలయ ప్రాంగణంలో మండల స్థాయి యోగా శిక్షణ కార్యక్రమాన్ని నిర్వహించారు. అనంతరం యోగాసనాల్లో ప్రతిభ చూపిన ఏడుగురికి ఆలయ చైర్మన్ దేవులపల్లి రవిశంకర్, ఎంపీడీఓ జగన్నాథం, తహసీల్దార్ నాగరాజు నాయక్ ప్రశంసాపత్రాలు అందజేశారు. ఎంఈఓ గణేష్, నాయకులు పాల్గొన్నారు.

వధూవరులకు మాజీ ఎమ్మెల్యే ఆశీస్సులు



వధూవరులను ఆశీర్వదిస్తున్న శ్రీనివాస్‌నాయుడు

నిడదవోలు: వైఎస్సార్ సీపీ ఉండ్రాజవరం నాయకుడు ఎస్.ప్రసాద్ కుమారుడు రాకేష్(టోనీ), సుప్రియ వివాహానికి మాజీ ఎమ్మెల్యే, పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జి జి.శ్రీనివాసనాయుడు శనివారం హాజరయ్యారు. వధూవరులను ఆశీర్వదించారు. ఆయన వెంట జిల్లా వ్యవసాయ సలహా మండలి మాజీ చైర్మన్ బూరుగుపల్లి సుబ్బారావు, పార్టీ పట్టణ అధ్యక్షుడు కామిశెట్టి సత్యనారాయణ, పెరవలి ఎంపీపీ కచర్ల ప్రసాద్, మున్సిపల్ వైస్ చైర్మన్ ఎలగడ బాలరాజు, కౌన్సిలర్ దాకే అనిల్‌కుమార్, పలువురు నాయకులు ఉన్నారు.

విద్యుత్ సరఫరాకు నేడు అంతరాయం

దేవరపల్లి: మండలంలోని దేవరపల్లి సెక్షన్‌లోని పల్లంట్ల 33/11 కేవీ సబ్‌స్టేషన్ పరిధిలో ఆదివారం ఆర్‌డీఎస్ఎస్ పనుల్లో భాగంగా 11 కేవీ పల్లంట్ల అగ్రికల్చర్ ఫీడర్ బైఫర్‌గేషన్, గ్రామంలో 11 కేవీ స్తంభాల నిర్మాణం కోసం విద్యుత్ సరఫరాకు అంతరాయం కలుగుతుందని ఏపీఈపీడీసీఎల్ నిడదవోలు ఈఈ (ఆపరేషన్స్) ఎస్.నారాయణ అప్పారావు తెలిపారు. అగ్రికల్చర్ ఫీడర్‌లో ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు సరఫరా నిలుపుదల చేస్తున్నట్టు చెప్పారు. 11 కేవీ పల్లంట్ల ఫీడర్ వ్యవసాయ విద్యుత్ ఉదయం 4 నుంచి 9 గంటల వరకు ఉంటుందన్నారు. త్రీఫేజ్ విద్యుత్ మధ్యాహ్నం 2 నుంచి ఇస్తామని తెలిపారు.

వెంకన్న ఆలయానికి పోటెత్తిన భక్తులు

పెరవలి: అన్నవరప్పాడు వేంకటేశ్వరస్వామి ఆలయానికి శనివారం వేలాది మంది భక్తులు పోటెత్తారు. స్వామివారికి అభిషేకం నిర్వహించిన అనంతరం భక్తులకు దర్శనం కల్పించారు. శనివారం స్వామి, అమ్మవార్లను అల్లనేరుడు పండ్లతో అలంకరించారు. తెల్లవారుజాము నుంచే వందలాది మంది భక్తులు తరలివచ్చారు. ఆలయ ప్రాంగణం చుట్టూ క్యూలైన్‌లో నిలబడడంతో దర్శనానికి గంట సమయం పట్టింది. ఆలయానికి వచ్చిన వేలాది మంది భక్తులకు అసౌకర్యం కలగకుండా ఆలయ అభివృద్ధి కమిటీ ప్రత్యేక చర్యలు తీసుకుంది. స్వామివారికి వందలాది మంది భక్తులు తలనీలాలు సమర్పించారు. దాతల ఆర్థికసాయంతో ఆరు వేల మందికి అన్న సమారాధన నిర్వహించారు. ఈఓ మీసాల రాధాకృష్ణ మాట్లాడుతూ, ప్రతి శనివారం భక్తులకు దాతల సహకారంతో అన్న సమారాధన నిర్వహిస్తున్నామని, ప్రసాదాలూ ఉచితంగా పంపిణీ చేస్తున్నామని తెలిపారు.

ఘనంగా వేంకటేశ్వరస్వామి బ్రహ్మోత్సవాలు

ఉండ్రాజవరం: మండల కేంద్రమైన ఉండ్రాజవరంలో కొలువైన భూ సమేత వేంకటేశ్వర స్వామి బ్రహ్మోత్సవాలు మూడో రోజు అత్యంత వైభవంగా జరిగాయి. శనివారం ఉదయం ప్రత్యేక పూజలు, మహిళలతో సామూహిక లక్ష కుంకుమార్చన నిర్వహించారు. సాయత్రం శ్రీమహాలక్ష్మి హోమం చేశారు. మాజీ ఎమ్మెల్యే జి.శ్రీనివాస్‌నాయుడు పాల్గొని, స్వామివారికి ప్రత్యేక పూజలు చేశారు. జిల్లా వ్యవసాయ సలహా మండలి మాజీ చైర్మన్ బూరుగుపల్లి సుబ్బారావు, దేవస్థానం చైర్మన్ కుదప చక్రపాణి తదితరులు పాల్గొన్నారు.

కార్మికుల తొలగింపు అన్యాయం

గోపాలపురం: యూనియన్ ఏర్పాటు చేసుకుంటే ఫ్యాక్టరీలో పనిచేసే కార్మికులను విధుల నుంచి తొలగించడం చట్టవ్యతిరేకమని ఐఎఫ్‌టీయూ రాష్ట్ర ఉపాధ్యక్షుడు జె.వెంకటేశ్వర్లు అన్నారు. గోపవరం భాగ్యనగర్ క్లోరైడ్ ఫ్యాక్టరీ కార్మికులను అన్యాయంగా తొలగించడంతో కార్మికులు రిలే నిరాహార దీక్షలు చేపట్టారు. శనివారం దీక్షా శిబిరాన్ని సందర్శించిన వెంకటేశ్వర్లు కార్మికులకు మద్దతు ప్రకటించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ, ఫ్యాక్టరీ యాజమాన్యం తొలగించిన కార్మికులను వెంటనే విధుల్లోకి తీసుకోవాలని, దీక్షా కాలానికి కూడా కార్మికులకు వేతనాలు చెల్లించాలని డిమాండ్ చేశారు. ఈ నెల 16న కొవ్వూరు ఆర్డీవో సమక్షంలో జరిగే చర్చలు ఫలించకపోతే, ఫ్యాక్టరీ యాజమాన్యంపై ఉద్యమం తీవ్రం చేస్తామని హెచ్చరించారు. కార్మికులకు హైకోర్టు న్యాయవాది ఎస్.శ్రీమన్నారాయణ, నాయకులు ఎం ఏసు, జి.ఆదినారాయణమూర్తి, ఆర్ రాఘవులు, జి.బాలరాజు మద్దతు తెలిపారు.

కాంగ్రెస్ నాయకుల ర్యాలీ

నిడదవోలు: ఎస్సీ, ఎస్టీ, బీసీల రిజర్వేషన్ చట్టాన్ని కూల్చడానికి బీజేపీ నాయకత్వంలోని కేంద్ర ప్రభుత్వం నిరంతరం కుట్ర సాగిస్తోందని డీసీసీ అధ్యక్షుడు టీకే విశ్వేశ్వరరెడ్డి ఆరోపించారు. పట్టణ కాంగ్రెస్ అధ్యక్షుడు మేడవరపు భద్రం దొర ఆధ్వర్యంలో శనివారం పట్టణంలోని ప్రజాస్వామ్య సంరక్షణ, రాజ్యాంగ పరిరక్షణ ఉద్యమంలో భాగంగా పార్టీ నాయకులు ర్యాలీ నిర్వహించారు. పార్టీ కార్యాలయం నుంచి వివిధ ప్రాంతాల మీదుగా కొనసాగింది.

చోరీ పథకం భగ్నం

- పోలీసులకు పట్టుబడ్డ ఏడుగురు నిందితులు
- కారుతో పాటు, గంజాయి, మారణాయుధాలు స్వాధీనం



మారణాయుధాలు, గంజాయి, కారు, నిందితులతో ఎస్సై రామకృష్ణ, సిబ్బంది

తాళ్లపూడి(కొవ్వూరు): బంగారు దుకాణాన్ని కొల్లగొట్టేందుకు పథకం పన్ని.. సినీ ఫక్కీలో చోరీకి బయలు దేరిన వ్యక్తులను మార్గ మధ్యంలోనే పోలీసులు అడ్డుకున్న ఉదంతమిది. నిందితులను అరెస్టు చేయగా.. వారు రవాణా చేస్తున్న గంజాయి కూడా పోలీసులకు పట్టుబడింది. కొవ్వూరు రోడ్ కం రైల్ బ్రిడ్జి వద్ద నిడదవోలు రోడ్డులో శనివారం మధ్యాహ్నం పోలీసులు వాహనాల తనిఖీ నిర్వహిస్తుండగా, కారులో గంజాయి, మారణాయుధాలతో వెళుతున్న నిందితులు ఏడుగురిని అరెస్టు చేసినట్టు పట్టణ సీఐ పి.విశ్వం తెలిపారు. ఆయన తెలిపిన వివరాల మేరకు, కారులో వెళుతున్న సాకా వంశీ(మార్టేరు), ఇజ్జాడ పాపినాయుడు(తణుకు), మర్రి సామేలు, పొలంగి సుబ్బరాజు, కాండ్రేగుల గురుప్రసాద్(అజ్జరం), చినమిల్లి శివకృష్ణ, నవరపు ప్రవీణ్(పెరవలి)ను పోలీసులు అరెస్టు చేశారు. వారి నుంచి 26 కిలోల గంజాయి, వాహనం, రెండు కత్తులు, ఇనుప రాడ్, ఐదు సెల్‌ఫోన్లు, రూ.1,130 నగదు స్వాధీనం చేసుకున్నారు. వారిని విచారణ చేయగా, కారును అద్దెకు తీసుకుని, చోరీకి బయలు దేరినట్టు తెలిపారు. ఇనుప రాడ్డు, పెద్ద కత్తి, చాకులతో శ్రీకాకుళంలోని చికలపాలెంలో ఉన్న బంగారం షాపులో చోరీ చేయడానికి పథకం పన్ని, అక్కడకు వెళుతున్నట్టు పోలీసుల విచారణలో తేలింది. తాళ్లపూడి ఎస్సై, కొవ్వూరు టౌన్ ఇన్‌చార్జి టి.రామకృష్ణ తన సిబ్బందితో కలిసి నిందితులను అరెస్టు చేశారు. పోలీసు సిబ్బందిని ఎస్పీ, డీఎస్పీ అభినందించారు.